ఇంటర్ తరగతులపై అనాసక్తి

- వేసవి ద్వితీయ సంవత్సరం తరగతులపై విద్యార్థుల అయిష్టత
- విద్యార్థుల ఇళ్లకు కబురు పంపుతున్నా స్పందన కరువు



రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నామమాత్రంగా హాజరైన విద్యార్థులు

రాయదుర్గంటౌన్: మండుటెండలో ఇంటర్ తరగతులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నామమాత్రంగానే హాజరవుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రారంభం నుంచే విద్యార్థులు నామమాత్రంగా హాజరవుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్, ఒకేషనల్ గ్రూపులకు కలిపి మొత్తం 607 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. గురువారం కేవలం 120 మంది మాత్రమే హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొత్తం 243 మందికి గాను 65 మంది హాజరయ్యారు.

నామమాత్రంగానే హాజరవుతున్న వైనం..

విద్యా రంగంలో సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఏ ఒక్కరికీ రుచించడం లేదని స్పష్టమవుతోంది. ఏటా వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తుంటారు. కానీ తాజాగా విద్యా క్యాలెండర్‌తో ఇటీవల పరీక్షలు రాసి వేసవి సెలవుల మూడ్‌లోకి వెళ్లిన విద్యార్థులను కాలేజీలకు రండి అని కబురు పంపినా, వారి నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. అంతేకాక వరుసగా ఉగాది, రంజాన్ పండుగలు జరుపుకుని వెనువెంటనే కళాశాలలకు వచ్చేందుకు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ముందస్తు ఎలాంటి కసరత్తు, క్షేత్రస్థాయి ప్రణాళిక లేకుండా ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభం, 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు అంటూ అయోమయానికి గురిచేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై ఏమాత్రం చర్చించకుండా అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించింది. మరోవైపు వసతి గృహాలు తెరుచుకోకపోయినా విద్యార్థులను కళాశాలలకు రావాలని చెబుతుండడంపై కూడా విద్యార్థులు ఆందోళనకు గురవుతున్న పరిస్థితి ఉంది.

ప్రభుత్వ విధానం సక్రమంగా లేదు



వేసవిలోనే తరగతులు ప్రారంభించడం అనే ప్రభుత్వ విధానం సక్రమంగా లేదు. దీని ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు లబ్ధి చేకూరుతుంది. ఆ విద్యా సంస్థల్లో విచ్చలవిడిగా అడ్మిషన్లు జరుపుకుంటారు. ప్రభుత్వం తెచ్చిన విద్యా సంస్కరణలు కార్పొరేట్‌కు ఉపయోగపడేలా ఉంది. గ్రామీణ విద్యార్థులు ఎండల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించుకుని షెడ్యూల్‌ను సవరించాలి.

– బంగి శివ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, రాయదుర్గం

క్లుప్తంగా

7 నుంచి ఫౌండేషన్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు

బొమ్మనహాళ్: 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ నెల 7 నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫౌండేషన్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌బాబు తెలిపారు. ఫౌండేషన్ కోర్సు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఆధార్‌కార్డు, 10వ తరగతి హాల్ టికెట్, ఫోటోస్‌తో కళాశాలను రావాలన్నారు. ఈనెల 1 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రికార్డ్స్, పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు హనుమంతనాయక్, శంకర్ లింగ, స్వప్న, వరలక్ష్మి పాల్గొన్నారు.

బొగ్గుల బట్టీలు ఎత్తేయాలని వినతి

కుందుర్పి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉన్న బొగ్గుల బట్టీలను ఎత్తివేయాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసులు, అటవీబీట్ అధికారి పరమేశ్వరప్పకు స్థానికులు గురువారం ఫిర్యాదు చేశారు. బండమీదపల్లి, ఎనుములదొడ్డి, అల్లాపురం, బసాపురం గ్రామాల్లో బొగ్గుల బట్టీలు ఏర్పాటు చేశారన్నారు. గ్రామాలకు దగ్గర్లోనే బట్టీలు ఉండడంతో తమకు ఇబ్బందిగా ఉందని అల్లాపురం, బసాపురం గ్రామాల ప్రజలు తెలిపారు. జంబుగుంపల, బెస్తరపల్లి అడవుల నుంచి కలపను రాత్రిళ్లు తీసుకొచ్చి బొగ్గులు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఎర్రబ్యాడ్జీలతో చేపట్టిన నిరసన రెండోరోజు గురువారం కొనసాగింది. ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం ఉదయం 5 గంటలకు మొదటి డ్యూటీ నుంచి ఎర్రబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన తెలియజేశారు. డిపో కార్యదర్శి తిప్పేస్వామి ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఉద్యోగులు ఇచ్చిన సమస్యలపై స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దేశ్వర, దామోదర్, జిలాన్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు విరివిగా కల్పించండి



ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నందకిశోర్

బ్రహ్మసముద్రం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నందకిశోర్ ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వలసలు వెళ్లకుండా ప్రతి ఒక్కరికీ స్థానికంగానే పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ పండరీష్, ఈసీ జయప్రకాష్, టీఏలు మంజునాథ, అవినాష్, వేణుగోపాల్, బీఎఫ్‌టీ వన్నూర్‌స్వామి , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కంబదూరు: మండలంలోని రాళ్ల అనంతపురం, నూతిమడుగు,తిప్పేపల్లి గ్రామాల్లోని నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. నూతిమడుగుకు చెందిన రామసుబ్బమ్మ అనే మహిళ వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. తిప్పేపల్లి శివారులో నాటుసారా తయారీ చేస్తున్న బొమ్మన్న అనే వ్యక్తికి చెందిన 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో సీఐ సునిల్‌కుమార్, ఎస్ఐలు ప్రవీణ్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల కోతకు కూటమి సర్కార్ కుట్ర



ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న వైద్యుడు



సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం వేచి ఉన్న దివ్యాంగులు

ఉరవకొండ: నియోజకవర్గంలో దివ్యాంగుల పింఛన్ల కోతకు కూటమి సర్కారు కుట్ర చేస్తోంది. ఇప్పటికే పెద్ద ఎత్తున కోతపెట్టింది. నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులను సైతం కొర్రీలు చూపుతూ వారిని పింఛన్లు తీసుకునేందుకు అనర్హులుగా చూపుతున్నారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో మడకశిర ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌తో పాటు వారి దివ్యాంగులా కాదా? అని పరీక్షలు చేశారు. క్యాంపులో దాదాపు 100 మంది దివ్యాంగులను చిన్న కారణాలు చూపుతూ అనర్హులుగా చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

భక్తుల ఆరాధ్యదైవం స్వయంభూ జంబుకేశ్వరస్వామి



రాయదుర్గంలోని కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామి ఆలయం



స్వామి మూలవిరాట్

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 10న కళ్యాణోత్సవం, 12న బ్రహ్మ రథోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన వృహివాన్విత స్వయంభూ జంబుకేశ్వరస్వామి నిత్య పూజలతో భక్తుల ఆరాధ్యదైవంగా వెలుగుగొందుతున్నాడు. దాదాపు 400 ఏళ్ల క్రితం నాటి ప్రాచీన సంస్కృతికి ప్రతిరూపమైన ఈ శైవక్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం చైత్రశుద్ధ అష్టమి శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. రాయదుర్గం బ్రాహ్మణ సంఘం వారి సహకారాలతో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమ వివరాలు..

జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 5నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి, ఆలయ అర్చకులు రామకృష్ణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 5న అంకురార్పణ, కలశస్థాపన, 6న ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం సూర్యప్రభ వాహనోత్సవం, 7న సింహ వాహనోత్సవం, 8న శేష వాహనోత్సవం, 9న కైలాస వాహనోత్సవం, 10న గురువారం ఉదయం 10 గంటలకు కళ్యాణోత్సవం, సాయంత్రం ముత్యాలపల్లకీ ఉత్సవం, 11న గజేంద్ర వాహనోత్సవం, 12న ఉదయం 10 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4 గంటలకు శ్రీవారి బ్రహ్మ రథోత్సవం, 13న పార్వాటోత్సవం, బాణసంచా వేడుక, సాయంత్రం అశ్వవాహనోత్సవం, 14న వసంతోత్సవం, మయూర వాహనోత్సవం, 15న సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవ కార్యక్రమం ఉంటాయన్నారు.

సంక్షిప్త సమాచారం

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల7వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి హాల్ టికెట్‌తో అడ్మిషన్ పొందొచ్చన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లతో పాటు నూతనంగా ఎంబీఐపీసీ గ్రూప్‌తోపాటు వృత్తి విద్య కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

మే నెలాఖరు వరకు మజ్జిగ అందిస్తాం

కుందుర్పి: స్థానిక కెనరా బ్యాంక్ కూడలి వద్ద నున్న చలివేంద్రంలో ప్రతి గురువారం మేనెలాఖరు వరకు మజ్జిగ అందిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు బీసీ తిమ్మప్ప, ఈరప్ప, మంజునాథ్, తిరుపాల్ తదితరులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మజ్జిగ అందిస్తామన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు.

గ్రామీణ క్రికెట్ టోర్నీ ప్రారంభం

కుందుర్పి: వేసవి సెలవులను పురస్కరించుకొని ఎనుములదొడ్డిలో కార్క్‌బాల్ గ్రామీణ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్ బహుమతి రూ.30 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందిస్తామన్నారు. ఈనెల 20వ తేదీలోపు రూ.2వేలు ప్రవేశ రుసుం చెల్లించి, జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్: 9449488709 లేదా 9494816303లో సంప్రదించాలన్నారు.

మోస్తరు వర్షం

కుందుర్పి: మండల వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. మలయనూరు, కుందుర్పి, జంబుగుంపల, మహంతపురం తదితర పంచాయతీల్లో 30ఎంఎం వర్షపాతం నమోదయ్యింది. కెంచంపల్లి, నాగేపల్లి, కదరంపల్లి తదితర గ్రామాల్లో వర్షానికి కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగిందని బాధిత రైతులు రామచంద్ర, హరికృష్ణ, నాగభూషణ తదితరులు తెలిపారు.

75 వీరాపురంలో ప్రత్యేక ఆధార్ సెంటర్

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, 8 వతేదీ నుంచి 11 వతేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బెళుగుప్ప: ఎర్రితాత ఆలయ ప్రాంగణంలో నంద్యాలకు చెందిన శాంతిరామ్ ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు తిప్పేస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్, ఆరోగ్యశ్రీకార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు రెండు, సెల్ నంబర్‌తో రావాలని తెలియజేశారు.

లక్ష్మంపల్లిలో చోరీ

శెట్టూరు : మండలంలోని లక్ష్మంపల్లిలోని ఆర్యవైశ్యుడు నాగేంద్ర ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు చొరబడి బంగారు, నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో షిర్డీసాయినాథుడు

వజ్రకరూరు: స్థానిక షిర్డీ సాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, తీర్థప్రసాదాల వినియోగం, మహా మంగళహారతి, తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రాత్రికి శేజ్ హారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆధార్ అప్‌డేట్ కోసం అష్టకష్టాలు



యూనియన్ బ్యాంకులోని ఆధార్ కేంద్రం వద్ద బయట పడిగాపులు కాస్తున్న మహిళలు, చిన్నారులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు కష్టకష్టాలు పడుతున్నారు. రాయదుర్గం మండలం, అర్బన్ పరిధిలో గురువారం కేవలం ఒకే ఒక సెంటర్‌లో సేవలందిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు నందు గల యూనియన్ బ్యాంకులోకి ఆధార్ సెంటర్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన ప్రజలతో కిక్కిరిసింది. మహిళలు, చిన్నారులు బ్యాంకు బయట పడిగాపులు కాశారు. ఈకైవీసీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరాలన్నా, బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, పాఠశాలల్లో చేర్పించాలన్నా, పేరు, చిరునామాలో మార్పులు, చేర్పులు, జననం, మరణం, నివాసం, కులం, ఆదాయం, ఇతర అప్డేషన్లకు ఆధార్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఇప్పటి దాకా పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచిలో ఒక్కొక్కటి చొప్పున కేంద్రాలు ఉన్నాయి. అందులో ఆపరేటర్లు లేక ఉన్నఫళంగా వాటిలో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ఇటీవల యూనియన్ బ్యాంకులో ఆధార్ కేంద్రం ప్రారంభం కాగా ఆ సెంటర్‌కు ఆధార్ అప్‌డేట్ కోసం గురువారం ప్రజలు క్యూకట్టారు. కేవలం రోజుకు 20 నుంచి 30 మందికి మాత్రమే టోకెన్లను ఇస్తుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ఉన్నతాధికారులు రాయదుర్గం పట్టణంతోపాటు రూరల్ పరిధిలో ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

సాధారణ కాన్పుతో తల్లీబిడ్డ సురక్షితం



కాన్పులపై అవగాహన కల్పిస్తున్న ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ నిరీషా

కణేకల్లు: సాధారణ కాన్పుతో తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారని, గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పు చేయించుకోవాలని కణేకల్లు సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ నిరీషా, గైనకాలజిస్ట్ జయశ్రీ తెలిపారు.గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సాధారణ కాన్పులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ నిరీషా మాట్లాడుతూ చాలా మంది గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకెళ్లి వేలాది రూపాయలు చెల్లించి, సిజేరియన్ చేయించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిజేరియన్ అవసరం లేకున్నా ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు స్వలాభం కోసం చేస్తున్నారన్నారు. సాధారణ కాన్పుతో తల్లీబిడ్డ ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందన్నారు. ప్రభుత్వాసుపత్రిలో 99శాతం సాధారణ కాన్పు చేయడానికే ప్రాధాన్యత ఇస్తామన్నారు. అత్యవసరమైతేనే సిజేరియన్ చేస్తారన్నారు. గర్భిణులు ప్రతి నెలా ఆరోగ్యపరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. రక్తహీనత, బీపీ లాంటి సమస్యలుంటే సరైన మందులిస్తామన్నారు. సాధారణ కాన్పుతో తల్లీ క్షేమం, బిడ్డకు రక్షణ కల్పించడంతోపాటు మరోవైపు ఖర్చు కూడా తగ్గుతోందన్నారు. సాధారణ కాన్పుతో తల్లీ వెంటనే కోలుకొని మానసికంగా ఆత్మస్థైర్యం కలిగి పాలు సమృద్ధిగా ఉత్పత్తి కావడం జరుగుతోందన్నారు. ముర్రుపాలతో బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతోందన్నారు. సాధారణ కాన్పుతో తల్లీకి రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పులతో మాతాశిశు మరణాల రేటు కూడా తగ్గుతోందని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు సిద్దేశ్వరి, శ్యామల, పార్వతి, ధనలక్ష్మి, అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు

- రూ.12 లక్షల రికవరీకి ఆదేశాలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

వజ్రకరూరు: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన ఉపాధి పనులకు రూ.8.42 కోట్లు వెచ్చించారు. సీసీ రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్, తదితర వాటికి రూ.3.33 కోట్లు వెచ్చించారు. ఈ పనులపై 2025 మార్చి 23 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి, తనిఖీలు చేశారు. ప్రజావేదికకు డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి,అంబుడ్స్‌మెన్ వెంకటేశ్వరరెడ్డి, విజిలెన్స్ సీనియర్ అసిస్టెంట్ ఫర్‌వీష్ తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన ప్రజావేదికలో పంచాయతీల వారీగా జరిగిన పనులు, తనిఖీల్లో గుర్తించిన అంశాలను అధికారులు వెల్లడించారు. పలుగ్రామాల్లో జరిగిన పనుల్లో కొలతలు తేడాలు ఉండటం,రైతుల పొలాల్లో బౌండరీ ట్రెంచులు లేకపోవడం, మొక్కలు లేకపోవడం, ఇంకుడు గుంతలు లేకపోయినా బిల్లులు మంజూరు చేసుకోవడం, మస్టర్లలో సంతకాలు లేకపోవడం వంటివి గుర్తించినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అనంతరం డ్వామా అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ సీనియర్ అసిస్టెంట్ ఫర్‌వీష్ మాట్లాడారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో 12 లక్షలా 834 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. లక్షా నలుగు వేల రూపాయలు జరిమానా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ వెంకటశివారెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్, సర్పంచులు మోనాలిసా, కమలమ్మ, ఏపీఓ లక్ష్మీకాంతబాయి, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం



ఉపాధ్యాయుడు నాగేంద్రగౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం ఉందని ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై. శివరామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కొనకొండ్లలోని జెడ్పీహెచ్ఎస్ తెలుగు పండితుడు (స్కూల్ అసిస్టెంట్) నాగేంద్రగౌడ్ ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. అనంతరం నాగేంద్రగౌడ్‌ను ఎమ్మెల్సీ సన్మానించారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని, ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు, పీడీలు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్నోబులేసుని దేవర ఉత్సవాలు



పెన్నోబులేశుడిని ఊరేగిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో పెన్నోబులేశుడి ఉత్సవాలను ఎస్సీకాలనీవాసులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను వేదావతి హగరిలో జలధికి తీసుకెళ్లి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోని వీధుల్లో మేళతాళాలు,ఊరాలతో ఊరేగించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్ పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువల పరిశీలన



రామసాగరం సమీపంలో హంద్రీనీవా కాలువలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

బెళుగుప్ప: మండలంలోని రామసాగరం అంకంపల్లి గ్రామాల సమీపంలోని హంద్రీనీవా కాలువలను మండల తహసీల్దార్ షర్మిళతో కలసి కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు గురువారం పరిశీలించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టడానికి కొంత భాగం బండరాళ్లు ఉండటంతో వాటి తొలగింపు అనుమతుల మంజూరుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్డీఓ, తహసీల్దార్‌లు పరిశీలించారు. కాలువ వెడల్పుకు ఎంత మేర బండరాళ్లు ఉన్నాయని నివేదికల పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని ఆర్డీఓ తెలిపారు.

మొక్కజొన్న పంట పరిశీలన



ఆవులెన్న వద్ద మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బెళుగుప్ప: ఆవులెన్న సమీపంలో మొక్కజొన్న పంటను కళ్యాణదుర్గం కేవీకే కోఆర్డినేటర్ చంద్రాయుడు, వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవీలత, లక్ష్మణ్, ఏడీ ఎల్లప్ప గురువారం పరిశీలించారు. రైతులు మల్లికార్జున, కుళ్లాయప్ప మాట్లాడుతూ నాసిరకం విత్తనాలతో పంట నష్టపోయినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు విత్తన రకం, మోతాదు ఇతర వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. పొలంలోని మట్టి, మోటారు నీరు, పంట నమూనాలను సేకరించి పూర్తి నివేదికలను జిల్లా వ్యవసాయ అధికారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ పృద్వీసాగర్, గ్రామ సర్పంచ్ రామ్‌మోహన్, ఏఓ తులసీ తదితరులు పాల్గొన్నారు.

ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు



ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాలు పైకప్పు దెబ్బతిని పెచ్చులూడుతున్న దృశ్యం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్ పైకప్పు దెబ్బతిని సిమెంట్ పెచ్చులూడి కింద పడుతున్నాయి. మీటింగ్ హాల్‌లో ప్రతి బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో పనుల కల్పనపై సమీక్ష, తరుచూ ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి శిక్షణలు, ఇతర సమావేశాలు, మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తుంటారు. వీటికి మండల అధికారులు, కింది స్థాయి సిబ్బంది హాజరవుతుంటారు. సిమెంట్ పెచ్చులూడి కిందపడతుండడంతో వారు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పెచ్చులూడి పడ్డాయి. అయితే ఆ సమయంలో సమావేశాలు నిర్వహించకపోవడంతో ప్రమాదం తప్పింది. ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న పైకప్పుకు మరమ్మతులు చేయించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు కోరుతున్నారు.